

ఆటాడుకుందాం.. రా

- నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు షురూ
- సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో అన్ని రకాల క్రీడల్లో తర్ఫీదు
- మే 31 వరకు కొనసాగింపు

సనత్‌నగర్: వేసవి సెలవుల జోష్ మొదలైంది. ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారి లోకం ఇక ఆటలతో అదరగొట్టేలా క్రీడా మైదానాలు సిద్ధమయ్యాయి. ప్రతియేటా లాగే ఈ సారి కూడా జీహెచ్ఎంసీ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు వేళ అయింది. వేసవి క్రీడా శిక్షణ సామగ్రి సైతం ఇప్పటికే ఆయా డివిజన్లకు చేరుకున్నాయి. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో అతి పెద్ద క్రీడా సౌధాలతో పాటు మైదానాలకు కొదువ లేదు. గ్రేటర్‌లో ఎక్కడా లేని విధంగా అన్ని రకాల ఇండోర్, ఔట్ డోర్ గేమ్స్‌లో ఆయా చోట్ల శిక్షణ కొనసాగుతుంటుంది. సాధారణంగానే నిరంతర శిక్షణ ఉంటుంది. అయితే వేసవి సెలవుల దృష్ట్యా వాటి స్థానంలో ఈ నెల 25 నుంచి మే 31 వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

05–16 అర్హులు..

ఎప్పటిలాగే అమీర్‌పేట్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లతో పాటు వివిధ క్రీడా ప్రాంగణాలు వేసవి శిక్షణ శిబిరాలకు వేదిక కానున్నాయి. క్రికెట్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, స్కేటింగ్, షటిల్, జిమ్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్, హాకీ, యోగా, చెస్, కరాటే.. ఇలా వివిధ క్రీడాంశాల్లో జీహెచ్ఎంసీ తరుపున శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు సిద్ధమయ్యారు. వేసవి శిక్షణ శిబిరాల ద్వారా కొనసాగే ఆటల్లో శిక్షణ పొందేందుకు 5 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సున్న వారు అర్హులుగా నిర్ణయించారు. ఆసక్తి గల బాలబాలికలు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి తెలిపారు. వేసవి శిబిరాల్లో అన్ని క్రీడల్లో శిక్షణ పొందేందుకు రూ.10 ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవచ్చు. స్కేటింగ్, క్రికెట్‌లో మాత్రం వేసవి శిక్షణ కోసం రూ.50 లు చెల్లించాల్సి ఉంటుంది. వేసవి శిక్షణ శిబిరాలకు హాజరయ్యే బాలబాలికలు www.ghmcsports.in వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించవచ్చు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు వేసవి శిక్షణ కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

స్కేటింగ్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.50
కోచ్: పవన్‌కుమార్
ఫోన్: 98665 13604

బాక్సింగ్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.10
కోచ్: ప్రకాశ్
ఫోన్: 93907 65412

జిమ్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.200 కోచ్: విక్రమ్
ఫోన్: 91772 85745

బ్యాడ్మింటన్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.50
కోచ్: సురేష్
ఫోన్: 99498 14362

హాకీ
వేదిక: అమీర్‌పేట్ క్రీడా మైదానం
ఫీజు: రూ.10
కోచ్: దర్శన్‌సింగ్
ఫోన్: 98497 21703

కరాటే
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.10
కోచ్: బాబు
ఫోన్: 96181 33057

జిమ్నాస్టిక్
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట డీకేరోడ్డు
ఫీజు: రూ.50
కోచ్: మహేష్
ఫోన్: 90002 77716

యోగా
వేదిక: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట్ డీకేరోడ్డు
ఫీజు: రూ.50
కోచ్: మనోజ్
ఫోన్: 99639 78509

హ్యాండ్‌బాల్
వేదిక: సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్
ఫీజు: రూ.10
కోచ్: ఇమ్రాన్‌ఖాన్
ఫోన్ : 91772 39786

బాస్కెట్‌బాల్
వేదిక: సనత్‌నగర్ ఎస్ఆర్‌టీకాలనీ ఇమ్మానుయేల్ చర్చి సమీపంలోని గ్రౌండ్
ఫీజు: రూ.10
కోచ్: నయిముద్దీన్
ఫోన్: 98483 96922

వాలీబాల్
వేదిక: సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్
ఫీజు: రూ.10
కోచ్: చిన్ని, పెద్ది
ఫోన్ : 99599 51499

క్రికెట్
వేదిక: సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్
ఫీజు: రూ.100
కోచ్: రాజ్‌కిరణ్
ఫోన్: 97041 59549



కేంద్ర ప్రభుత్వ భూముల్లో వెలిసిన ఓ బస్తీ

ఈసారైనా పట్టాలు దక్కేనా?

- ప్రభుత్వ భూముల్లో లక్షకుపైనే బస్తీవాసులు
- బోర్డు ఎన్నికల్లో ఓటు హక్కుకు దూరం
- ప్రతి ఎన్నికల్లో హాట్ టాపిక్‌గా 'పట్టాల వ్యవహారం'
- నేటి సీఎం రోడ్‌షో ప్రకటనపై సర్వత్రా ఆసక్తి



సీఎం రేవంత్‌పై ఆశలు..

పదేళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బాలంరాయి నుంచి అన్నానగర్ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహించి, అక్కడ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. తాను కంటోన్మెంట్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడంతో పాటు రక్షణ శాఖ, ఎయిర్‌పోర్టు భూముల్లో వెలిసిన బస్తీవాసులకు భూబదలాయింపు ద్వారా పట్టాలు ఇస్తామని ప్రకటించినా పదేళ్లుగా ఈ హామీ నెరవేరలేదు. తాజాగా కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం బాలంరాయి నుంచి అన్నానగర్‌కు వరకు రోడ్ షో నిర్వహించనున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి అయినా కనికరిస్తారని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో సుమారు లక్ష మంది ఓటర్లు కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో అనర్హులు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు వేసే వీరికి బోర్డు ఎన్నికల్లో మాత్రం ఓటు హక్కు కల్పించరు. కారణమేంటంటే వీరంతా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల్లో నివసిస్తున్నారు. ఓట్లతోనే సరిపెట్టకుండా ఆయా నిర్మాణాలపై చర్యలు చేపడితే ఇక అంతే సంగతి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని భూబదలాయింపు చేపడితే మినహా ఈ బస్తీవాసుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ప్రతి ఎన్నికల్లో పార్టీలు హామీ ఇవ్వడం మినహా భూబదలాయింపు విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం.

దరఖాస్తుల తిరస్కరణ

2014లో రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కొలువు తీరింది. ఆరు నెలల్లోనే కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు జీఓ నెం.58 ప్రకారం ప్రభుత్వ భూముల్లోని బస్తీవాసులకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని రక్షణ, ఎయిర్‌పోర్టు భూముల్లోని వారికి సైతం భూబదలాయింపు ద్వారా పట్టాలు ఇస్తామని చెప్పారు. ఈ మేరకు తిరుమలగిరి మండల పరిధిలో 6,592 మంది జీఓ నెం.58 కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వీరిలో 278 మంది మాత్రమే పట్టాలు ఇచ్చి, మిగిలిన 6,314 మంది దరఖాస్తులను తిరస్కరించారు. కారణమేంటంటే వీరంతా రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని ఎయిర్‌పోర్టు, రక్షణ భూముల్లో నివాసముంటున్నారు. ఇదే కారణంతో మరో 10 వేల మందికిపైగా రసూల్‌పురాలోని బస్తీ వాసులు కనీసం దరఖాస్తులు కూడా చేసుకోలేదు.

లక్ష మందిపై వేటు..

2018 నాటికి కంటోన్మెంట్ ఓటర్లు 1,91,849 మంది ఉన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా తొలిదశలో ప్రభుత్వ స్థలాల ఆక్రమిత నివాసాల్లోని 28,419 మంది ఓటరు జాబితా నుంచి తొలగించారు. మళ్లీ 2020 నాటికి తుది ఓటర్ల సంఖ్య మళ్లీ తగ్గి 1,42,782కు చేరింది. అంటే ఈ ఏడాదిలోనూ మరో 20,648 ఓట్లు తగ్గాయి. 2021లోనూ మరో 10వేల ఓట్లు తగ్గి, కంటోన్మెంట్ ఓటర్ల సంఖ్య 1,32,722కు చేరింది. మొత్తంగా సుప్రీం కోర్టు తీర్పు అనంతరం గత నాలుగేళ్లలో కంటోన్మెంట్ ఓటర్ల సంఖ్య 59,127 తక్కువగా ఉంది. ప్రతీయేటా కనీసం 5శాతం నూతన ఓటర్లను పరిగణనలోకి తీసుకుంటే నాలుగేళ్లలో లక్ష మంది ఓటర్లపై వేటు పడింది.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పద్మారావునగర్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం బడిబాట నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధనకు బాటలు వేస్తున్నామన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ పాఠశాల నుంచి అనేక మంది గురుకులాలకు ఎంపికయ్యారన్నారు.

పద్మారావును గెలిపించుకుందాం



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గెలుపు కోసం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ బుధవారం పాదయాత్ర చేపట్టారు. డివిజన్ పరిధిలోని భవానీనగర్, కిందిబస్తీ, అన్నానగర్, నెహ్రూ స్కూలు గల్లీ, నామాలగుండు ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటేసి పద్మారావును గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే పద్మారావు సికింద్రాబాద్‌ను ఆదర్శవంతమైన అసెంబ్లీ నియోజవర్గంగా తీర్చిదిద్దారని ఎంపీగా గెలిపిస్తే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

మహిళలతో అసభ్యకర ప్రవర్తన.. వ్యక్తికి జైలు



పరుశురామ్

చిలకలగూడ: మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలుశిక్ష పడింది. చిలకలగూడ సీఐ అనుదీప్, ఎస్ఐ జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన పరుశురామ్ (34) మంగళవారం రాత్రి బస్తీలోని మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు పరశురామ్‌ను అదుపులోకి తీసుకుని ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు. బుధవారం సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా రెండ్రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి రవిశంకర్ తీర్పునిచ్చారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. లాలాగూడ రైలు పట్టాల పక్కనున్న ఓ చెట్టుకు ఉరేసుకున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతుడికి 45 ఏళ్లు ఉంటాయని చేతిపై హెచ్ అని టాటూ, ఒంటిపై గులాబీ రంగుపై నల్లని చుక్కల చొక్కా, నల్లని ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. వేరే ప్రాంతం నుంచి లాలాగూడకు వచ్చి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.


పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు



రామకృష్ణ

అమీర్‌పేట: పోక్సో కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించిన ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 2022లో జరిగిన ఘటన సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ కాళీమందిర్ సమీపంలోని కాళికానగర్‌కు చెందిన జి.రామకృష్ణ (44) డ్రైవర్. ఖైరతాబాద్ నుంచి రోజూ బడి పిల్లలను తీసుకుని అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వదిలి పెట్టేవాడు. ఈ క్రమంలో నర్సరీ చిన్నారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని నాంపల్లి 12వ మెట్రోపాలిటన్ అడిషనల్ సెషన్స్ జడ్జి ముందు హాజరు పరిచి సాక్ష్యాలు సమర్పించగా న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

ఎంఈసీలో 'లక్ష్య' విద్యార్థినికి అత్యుత్తమ మార్కులు



సాక్షి,సిటీబ్యూరో: ఎస్ఆర్ నగర్‌లోని 'లక్ష్య' జూనియర్ కళాశాల విద్యార్థిని గొల్లల సంయుక్త ఎంఈసీ ద్వితీయ సంవత్సరంలో 988/1000 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. అదే విధంగా కళాశాల విద్యార్థులు పూజారి వైష్ణవ అనిరుధ్, సెరెనా షీర్లీ, సురబోయిన ఆదికేశవ 494/500 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ సీపీ మురళీ వైట్ల, డైరెక్టర్ శివప్రసాద్ రెడ్డి అభినందించారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం





నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కందోజు మోహన్, సర్వే సత్యనారాయణ

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నిక కోసం బుధవారం 8 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్, తెలంగాణ రాజ్య సమితి అభ్యర్థి సారారపు శ్రీశైలం, లయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున తల్లెడ రాధ, స్వతంత్ర అభ్యర్థులుగా వీకే విజయలక్ష్మి, ఒర్సు అల్లారయ్య, కే.మురళీకృష్ణ, కొండోజు మోహన్, మహ్మద్ ఫసీయుద్దీన్ నామినేషన్లు దాఖలు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ల సంఖ్య 37కు చేరినట్టు రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ పేర్కొన్నారు.

కంటోన్మెంట్ అసెంబ్లీకి..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి బుధవారం కొత్తగా 13 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 26కు చేరింది. కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేశ్ నారాయనన్ (3), బీఆర్ఎస్ నుంచి జి. నివేదిత (2), బీజేపీ అభ్యర్థి డాక్టర్ టీఎస్ వంశ తిలక్‌తో పాటు బీజేపీ రెబెల్ అభ్యర్థిగా ఎం.ఏ. శ్రీనివాస్ (2), కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ కాంగ్రెస్ తరపున ఒకటి, ఇండిపెండెంట్‌గా మరో సెట్ నామినేషన్ వేశారు. వీరితో పాటు బహుజన్ ముక్తి పార్టీ నుంచి యు. రాజేందర్ (3), శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్ (2), ఇండిపెండెంట్‌లుగా బంగారు రాజు, జే. నర్సింగ్ రావు, (2), జీడిమడ్ల రాజ్‌కుమార్ (2), ఎం. జైరామ్, ఈ. శంకర్, దండే రత్నం (2), రేకల సైదులు, బండారు నాగరాజు, సంజీవులు నామినేషన్లు వేశారు. ఇప్పటి వరకు మొత్తం 16 మంది 26 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై సీపీకి ఫిర్యాదు



వివరాలను వెల్లడిస్తున్న బాధితులు

లాలాపేట: ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ తమ కుటుంబ సభ్యులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మెట్టుగూడ కేశవనగర్ కాలనీకి చెందిన సామ్యూల్ కిరణ్ కుమార్ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. అతని నుంచి తమకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలనీ విజ్ఞప్తి చేస్తూ సీపీ దృష్టికి తీసుకెళ్లాడు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు సామ్యూల్ కిరణ్, సాల్మన్ వివరాలు వెల్లడించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్న జగదీష్‌కుమార్ తమ ఇంటి ముందు రోడ్డుపై దౌర్జన్యంగా ఏర్పాటు చేసిన ఐరన్ షెడ్(గణేష్ ఉత్సవం కోసం)ను జీహెచ్ఎంసీ అధికారుల సహాయంతో తీయించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి తమపై కక్ష్య పెంచుకున్న జగదీష్ కుమార్ కొందరి యువకులు మహిళలను తమ ఇంటిపైకి పంపించి దాడి చేయించాడు. ఈ దాడిలో తమ అమ్మ తీవ్రంగా గాయ పడిందన్నారు. దీనిపై చిలకలగూడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అంతేకాక సదరు కానిస్టేబుల్ రోడ్డుపై కూర్చుని రాకపోకలు సాగించే వారిని సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. తమ ఇంటికి ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను తొలగించాలంటూ ఒత్తిడి చేయడంతో పాటు తరచూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నాడని అందుకే సీపీని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా సీపీ తమకు రక్షణ కల్పించాలని కోరారు.

ఫౌండేషన్ డే పండుగ ప్రారంభం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 107వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం ఇంజినీరింగ్ కాలేజీ నుంచి సెంటినరీ పైలాన్ వరకు జరిగిన 2కె రన్‌ను వీసీ ప్రొ.రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఫౌండేషన్ డే భాగంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని నేడు, రేపు (25, 25) ఓపెన్ హౌస్, ఉస్మానియా కార్యక్రమాలలో భాగంగా ప్రసంగాలు, సదస్సులు, ఎగ్జిబిషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలలను విభాగాలను ముస్తాబు చేసినట్లు వివరించారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయ వార్షిక వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం స్వామి వారికి 18 రకాల ఫలాలతో అలంకరించారు. గురువారం స్వామివారు చందన అలంకరణలో దర్శనమిస్తారని ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా పేర్కొన్నారు. –చిలకలగూడ

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేస్తున్న డీసీ సుభాష్‌రావు

సికింద్రాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల జాబితాను సహాయక ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ డీసీ డి.సుభాష్‌రావు బుధవారం విడుదల చేశారు. నియోజకవర్గంలోని 102 భవనాల్లో 220 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గవాసుల సౌకర్యార్థం ఓటరు జాబితాను జీహెచ్ఎంసీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ప్రశాంత వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం ఇంజినీరింగ్, పోలీసు అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు కే.భుజేందర్‌బాబు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయులతోనే విద్యావ్యాప్తి

ఉస్మానియా యూనివర్సిటీ: మహనీయులతో విద్యావ్యాప్తి చెంది పేదల జీవితాల్లో మార్పు వచ్చిందని ఓయూ సైఫాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.లక్ష్మణ్ నాయక్ అన్నారు. కాలేజీలో ఏర్పాటు చేసిన పూలే, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవంలో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొ.కాశీం, వైస్ ప్రిన్సిపల్ డా.నవనీత, వెంకటరమణ, బాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు అరవింద్, సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి వంశ తిలక్ గెలుపు ఖాయమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇటుకు శ్రీకిషన్ మాదిగ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ నాలుగో వార్డు పికెట్‌లో ఎమ్మార్పీఎస్ కళాబృందం ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కంటోన్మెంట్‌లో అధిక సంఖ్యాకులైన మాదిగ వర్గానికి చెందిన వారికే టికెట్ కేటాయించాల్సిందిగా తాము ప్రధాన పార్టీలకు డిమాండ్ చేశామని అయితే బీజేపీ మాత్రమే మాదిగ సామాజిక వర్గానికి చెందిన వంశ తిలక్‌కు టికెట్ ఇచ్చిందని వంశ తిలక్‌ను గెలిపించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కళ్యాణ్ అజిత్, సునీల్ మాదిగ, కళాబృందాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నా మెజారిటీ.. అడ్డగుట్ట



ఎన్నిక ఏదైనా మెజారిటీ మాత్రం అడ్డగుట్టలోనే వస్తోందని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన అడ్డగుట్ట డివిజన్‌లోని ఏ,బీ,సీ, డీ సెక్షన్లలో పర్యటిస్తూ మాట్లాడారు. అడ్డగుట్ట తన మెజారిటీకి అడ్డా అన్నారు. తాము చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. –అడ్డగుట్ట

ఇంటర్ ఫలితాల్లో సర్కారు విద్యార్థుల సత్తా

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ వైఎంసీఏ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఆలే నారాయణ 1000 మార్కులకు 936, తడ్కపల్లి ఉమేష్ కుమార్ ఎంపీసీ 917, తుమ్మపూడి సంజయ్ ఎంఈసీ 896, సాధించారు. ద్వితీయ సంవత్సరం వృత్తివిద్యా కోర్సులైన ఏ అండ్ టీలో నిషాంత్ 927, సీఎస్‌లో గోట భార్గవ్ 920, ఎంఎల్‌టీలో ప్రభాస్ 919, మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో బైపీసీకి చెందిన రాఘవేంద్ర 440 మార్కులకు 423, ఎండీ అఫ్గాన్ 419, ఎంపీసీలో ఎండీ ఇర్ఫానుద్దీన్ 470 మార్కులకు 445 సాధించారు. వృత్తివిద్యా కోర్సులైన ఎంఎల్‌టీలో కౌశిక్ 500 మార్కులకు 456, ఓఏలో ఎండీ అజీమ్ 445, సీఎస్‌లో ప్రణయ్ కుమార్ 396, ఏఅండ్‌టీలో వెంకట్ రావు 396, మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శైలజ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

దానం.. జనసందోహం



సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో దానంకు మద్దతుగా సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు మహంకాళి అమ్మవారిని సీఎం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. –సాక్షి, సిటీబ్యూరో